పిజిఆర్ఎస్‌కు 23 వినతులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 23 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. 18 మంది నేరుగా వచ్చి సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించగా, ఐదు మంది ఫోన్ ద్వారా సమస్యలు తెలిపారు. వినాయక సాగర్‌లో పాడైన పరికరాలు మరమ్మత్తులు చేయించాలని, రవీంద్ర నగర్‌లో ప్రజలకు త్రాగునీటి వసతి కల్పించాలని, పద్మావతి పార్క్ వద్ద ఆకతాయిలు మద్యం సేవిస్తున్నారని, వాహనాలు పార్క్ చేయకుండా దిమ్మెలు ఏర్పాటు చేయాలని, బీటీఆర్ బాండ్లు ఇప్పించాలని, భవానీ నగర్‌లో తెలుగు గంగ నీరు ఎక్కువ సమయం పంపిణీ చేయాలని, ప్రమాదంగా ఉన్న కాలువపై బండలు వేయాలని, యాదవ వీధిలో భూగర్భ డ్రైనేజీ మరమ్మత్తు చేయాలని, తిమ్మినాయుడు పాలెంలో భూగర్భ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అన్ని ఫిర్యాదులు ఆయా విభాగాల అధికారులకు పంపామని పరిష్కరించాలని ఆదేశించామని కమిషనర్ తెలిపారు.

డప్పుకు జాతీయ గుర్తింపు కావాలి

- ఏపీడీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆనందబాబు
- శ్రీకాళహస్తిలో ప్రారంభమైన ఏపీడీకేఎస్ జిల్లా మహాసభలు
- డప్పుల మోతతో దద్దరిల్లిన పుణ్యక్షేత్రం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అతి ప్రాచీన కళ డప్పుకు జాతీయ గుర్తింపు కావాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. డప్పు దరువుకు..ఆదరువయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారమందించాలని విజ్ఞప్తి చేశారు. డప్పు కళాకారుల సంఘం తిరుపతి జిల్లా ప్రథమ మహా సభలు సోమవారం శ్రీకాళహస్తిలోని మహేష్ కళ్యాణ మండపంలో ఆ సంఘం జిల్లా నాయకులు సంక్రాంతి వెంకటయ్య, పెంచలయ్యల అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వచ్చిన వందలమంది డప్పు కళాకారులు పట్టణ నాలుగు మాడ వీధుల్లో డప్పుల మోత మోగించారు. డప్పు కళను నిర్లక్ష్యం చేస్తే పాలకుల నిద్రపోతామంటూ దరువు ద్వారా చాటి చెప్పారు.

ఆర్టీసీ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా సభా స్థలి అయిన మహేష్ కళ్యాణ మండపానికి చేరుకున్నారు. డీకేఎస్ జెండాను సీనియర్ నాయకులు మునయ్య ఆవిష్కరించారు. అనంతరం ప్రారంభమైన మహా సభలో ఆనంద్ బాబు పాలకుల తీరుపై నిప్పులు చెరిగారు. పాటకు, ఆటకు గుర్తింపునిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డప్పు ఎందుకు గుర్తింపునివ్వడం లేదని మండిపడ్డారు. డప్పులు వాయించేది దళితులు కాబట్టే అంటరానివారిగా వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేర్చుకున్న కళలకు రూ.7 వేలు పెన్షన్ ఇస్తుండగా, ప్రాచీన కళ డప్పును నమ్ముకున్న కళాకారులకు రూ. 4 వేలే ఇస్తారా..? [illegible] రు. డప్పు కళాకారుల వయోపరిమితిని 45కు తగ్గించి పెన్షన్ రూ. 7 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచిపోయినా ఇప్పటివరకు డప్పు కళాకారుల పెన్షన్ జాబితాను ఆన్లైన్ లో ఉంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డప్పు కళాకారులకు ధార్మిక క్షేత్రాల్లో ప్రదర్శనలకు, ట్రస్ట్ బోర్డుల్లో పదవులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డులు, బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీ ఇవ్వాలన్నారు. ఇల్లు, రెండెకరాల భూమి మంజూరు చేయాలన్నారు. డప్పు కళ అంతరించిపోకుండా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రూ.10 లక్షల ప్రమాద బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులు సమరశీల ఐక్య పోరాటం ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలరని సీఐటీయూ జిల్లా నాయకులు వందవాసి నాగరాజు, అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. నాయకులు దాసరి జనార్దన్, పెంచలయ్య, సంక్రాంతి వెంకటయ్య, రెడ్డిపల్లి సురేష్, పెనగడం గురవయ్య, గంధం మణి, షరీఫ్, గెడి వేణు, హరినాథ్, అరుణాచలం, శ్రీనివాసులు, రంగయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ : శ్రీకాళహస్తిలో జరిగిన డప్పు కళాకారుల సంఘం మహాసభలకు బుచ్చినాయుడుకండ్రిగ మండలం నుంచి డప్పు కళాకారులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన బుచ్చినాయుడు కండ్రిగలో డప్పు కళాకారులను ఉద్దేశించి నలుగురు రమణయ్య, బాల గురవయ్య పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని కోరారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణలపై చర్యలు తీసుకోండి : సిపిఎం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - మంగళం: మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్ సమీపంలోని సర్వే ట్రైనింగ్ అకాడమీ పరిధి భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సిపిఎం పార్టీ తిరుపతి నగర కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో మంగళం బిటిఆర్ కాలనీ సిపిఎం శాఖ కార్యదర్శి నిమ్మనపల్లి మునిరత్నం, చల్లా చిన్న వెంకటయ్య, మోదిన్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ను సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలు కలిసి వినతి ఇచ్చారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ తిరుమల నగర్ పరిధిలోని సర్వేనెంబర్ 195/1లో భూమిని అధికార పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు ఆగ మేఘాలపై అక్రమ నిర్మాణాలు చేయడం, దీనిని రెవెన్యూ యంత్రాంగం అడ్డుకోకుండా ప్రేక్షక పాత్ర పోషించడం దారుణం అన్నారు. ఈ సందర్భంగా మంగళ ప్రాంత శాఖ కార్యదర్శి నిమ్మనపల్లి మునిరత్నం, మోదిన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హాయంలో మంగళం ప్రాంతంలో ఉన్న పేద ప్రజల కోసం శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని చిందేపల్లి వద్ద జగనన్న లేఔట్ లో పట్టాలు ఇచ్చారన్నారు. గతంలో మంగళం ప్రాంతంలో పట్టాలు కేటాయించబడ్డ వారికి స్థానికంగానే ఇల్లు ఇవ్వాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తూ సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలానికి వెళ్లి గుడిసెలు వేయడానికి ప్రయత్నిస్తే అప్పట్లో పోలీసులు అడ్డుకున్నారని అన్నారు. అటు తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంలోని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నానికి సిపిఎం పార్టీ బృందంగా స్థానికంగా ఉన్న పేద ప్రజలకు సొంత ఇల్లు ఇక్కడే నిర్మించి ఇవ్వాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే ఎన్టీఆర్ గృహాలు నిర్మాణం చేసి లబ్ధిదారులకు కేటా ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. సర్వే ట్రైనింగ్ అకాడమీ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, గత మూడు రోజుల నుండి తెలుగుదేశం పార్టీకి చెందిన కొంతమంది 10 ఇల్లు పక్కా గృహాలు సిమెంట్ రాళ్లతో నిర్మాణం చేసుకుంటే రెవెన్యూ యంత్రాంగం మామూలు మత్తులో పడి ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. మళ్లీ అక్రమ నిర్మాణాలు చేయకుండా ఆక్రమిత భూమిలో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నేతలు బాదుల్లా, జి.లోకయ్య తదితరులు పాల్గొన్నారు.

దోబీ ఘాట్ ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: దోబీ ఘాట్ ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జయచంద్ర, సుమన్ మాట్లాడుతూ తిరుపతి రూరల్ వేదాంతపురం పంచాయతీలో 2014 సర్వే నెంబర్లు 56 సెంట్లు గల విలువైన భూమిని కొంతమంది పెత్తందారులు, ఆ గ్రామ మాజీ సర్పంచ్ చిరంజీవి రెడ్డి, ముదిరాజ్ చంద్ర అనే వ్యక్తులు ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకుంటున్నారు. 20 కోట్ల విలువగల రజకుల దోబీ ఘాటును ఆక్రమించుకోవడం అన్యాయమన్నారు. 2006 నుంచి ఇప్పటివరకు ఆ దోబీ ఘాట్ లోకి పోనీయకుండా, అనేక రకాలుగా ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. ధోబి ఘాట్ లోకి వెళ్లి బట్టలు ఉతకడానికి ప్రయత్నం చేస్తే, రజకుల పైన దాడి చేసి గాయపరుస్తున్నారని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు పోరాడుతూనే ఉన్నామని, అయినా దోబి ఘాటి స్థలాన్ని సాధించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్వోకి అనేకసార్లు విన్నవించినప్పటికీ, ఆఫీసు చుట్టూ చెప్పులురిగేలా తిరిగినా కనీసం కనికరించడం లేదన్నారు. కలెక్టర్ ఈ సమస్యను పరిష్కారించి, రజకులకు దోబీ ఘాట్‌ను కాపాడాలని కోరారు.

గోవిందయ్యకు సీనారే సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జిల్లాకు చెందిన కవి గొడుగుచింత గోవిందయ్యకు సినారె పురస్కారం లభించింది. ఈ సందర్భంగా కవి గోవిందయ్యను భారతీయ రచయితల సమైక్య వ్యవస్థ పద్ధతులు డాక్టర్ మర్రిపూడి దేవేందర్ రావు సోమవారం సత్కరించారు. పలువురి ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంవి.కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 283 అర్జీలు

- సకాలంలో అర్జీదారులకు పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా నలుమూలల నుండి క్షేత్రస్థాయిలో పరిష్కారానికి నోచుకొని సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజాసంస్థల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీ దారునికి సకాలంలో పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డిఆర్ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్ అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సూపర్ జీఎస్టి, సూపెర్ సేవింగ్స్ అనే గోడ పత్రికలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. జిఎస్టి తగ్గుదల పై గ్రామ సచివాలయ వార్డు సచివాలయ స్థాయిలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి మారుమూల గ్రామాలలో నివసిస్తున్న ప్రజలకు గడప గడపకు వెళ్లి జిఎస్టి తగ్గుదలపై వారికి అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలని సంబందిత సిబ్బందిని ఆదేశించారు. రెవిన్యూ శాఖకు సంబంధించి 172, పౌరసరఫరాల శాఖ 11, గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం శాఖకు 9 అర్జీలు మొత్తం కలిపి 283 అర్జీలు వచ్చాయని అధికారులు ప్రకటించారు.

భూమి ఇస్తామని డబ్బు కట్టించుకొని..

తిరుపతి మంగళం ప్రాంతంలో భూమి ఇప్పిస్తామని 1998 నుండి 2000 సంవత్సరం వరకు నెలకు రూ.2000 రూపాయల చొప్పున కట్టించుకుని చరిష్మా హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు సీఎం మల్లికార్జున రెడ్డి, శ్రీదేవి, మురళీకృష్ణ మోసం చేశారు. 20 ఏళ్ల క్రితం దాదాపు 150 మందికి పైగా ఇంటి స్థలం వస్తుంది కదా అని నమ్మి డబ్బులు ఇస్తే కట్టిన చలానాలకు తక్కువగా కట్టారని నింద వేసి నేడు భూమి విలువ పెరగడంతో మొహం చాటేస్తున్నారన్నారు. భాగస్వామ్యుల మధ్య వచ్చిన అంతరాల కారణంగా కోర్టు మెటికాయలు వేయడంతో అందరూ కలిసి ఇప్పుడు ఒక్కటై డబ్బులు కట్టిన వారందరినీ మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని, తనకు మోసం చేసిన వ్యక్తుల నుండి%జ%భూమి ఇప్పించాలని కోరుతున్నాను.

- ఎరుకుల దేవాంజనేయులు, అనంతపురం రూరల్, అనంతపురం జిల్లా

మా అనుభవ భూమిని కబ్జా చేస్తున్నారు..



తొట్టెంబేడు మండలంలోని సర్వే నెంబర్ 75/4లో గల ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం 1988 డీకేటి పట్టా ద్వారా కేటాయించింది. అయితే మా స్వగ్రామమైన పవనవారి కండ్రిగకు చెందిన చింత తిరుపాల్, చింత వెంకటేష్, సర్దికూటి లోకేష్ అనే వ్యక్తులు ఏడాదిగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తూ అడ్డొచ్చిన నన్ను ఇష్టానుసారం కొట్టి కుడి చెయ్యి కూడా విరగగొట్టేసారు. పట్టా ఒక దగ్గర, పాసుబుక్కు ఒక దగ్గర, భూమి ఒక దగ్గర ఉండటంతో ఒకే చోట హక్కులు కల్పించాలని 2019లో కోర్టులో వాజ్యం వేశాను. కోర్టులో సదరు భూమికి సంబంధించి వాజ్యం నడుస్తుండగానే క్రమేపి దాడులకు తెగబడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- సర్దికూటి వీరాస్వామి, పవనవారి కండ్రిగ, కేవీబిపురం మండలం

ఈవిఎం గోడౌన్ల తనిఖీ

వివిధ పార్టీల రాజకీయ నాయకులతో కలిసి ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - రేణిగుంట: తిరుపతి జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 2019 జనరల్ ఎలక్షన్లలో ఉపయోగించిన ఈవీఎంలు ప్రస్తుతం రెవెన్యూ డివిజన్‌లో ఉన్న ప్రత్యేక గోడౌన్‌లో భద్రంగా నిల్వ చేయబడ్డాయని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం సాయంత్రం రేణిగుంట మండలంలోని ఈవిఎం గోడౌన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, ఈవిఎం గోడౌన్‌ను ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా ఎన్నికల అధికారిగా ప్రత్యక్షంగా తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో నేడు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్ ఓపెన్ చేసి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు వర్షాకాలంలో గోడౌన్‌లో నీటి లీకేజీల అంశంపై చర్యలు తీసుకోవాలని సూచించగా దాన్ని దృష్టిలో పెట్టుకొని, రోడ్లు, భవనాలు శాఖ ఇంజినీర్లను సంప్రదించి, 20 రోజులలోగా పూర్తి స్థాయిలో గోడౌన్‌కు అంచనా వేసి అవసరమైన మరమ్మత్తులు చేయాలని సంబందిత అధికారులకు ఆదేశించామన్నారు. ఈ చర్యలన్నీ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు, ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేందుకు చేపట్టబడుతున్నాయన్నారు. గోడౌన్ తాలూకా అన్ని పనులు, తాళాలు తీసే లేదా వేసే ప్రక్రియలు కూడా రాజకీయ పార్టీల సమక్షంలోనే జరగడం అనేది అత్యంత ప్రాధాన్యత గల విషయమని తెలిపారు. ఈ చర్యలన్నీ ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తిగా పారదర్శకంగా, నియమానుసారం నిర్వహించబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : చంద్రగిరి నియోజకవర్గం, చంద్రగిరి ఆంధ్రజ్యోతి దినపత్రిక రిపోర్టర్ లీలాకృష్ణ, టివి9 రిపోర్టర్ సురేష్, బిగ్ టివి రిపోర్టర్ శంకర్‌ల పై రామచంద్రపురం పోలీసులు పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఉపసంహరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు వళిగళం గోపి, తిరుపతి జిల్లా అధ్యక్షులు జి.శ్రీధర్ లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రామచంద్రపురంలోని లీలాకృష్ణ తాతలనాటి ఆస్తికి పాసుబుక్ మంజూరు చేయాలని, ఆన్ లైన్‌లో నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. మీ ఆస్తి తగాదోల్లో ఉందని రెవిన్యూ అధికారులు కాలయాపన చేశారు. లీలాకృష్ణ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ కార్యాలయానికి రమ్మని తాహశీల్దార్ పిలిచారు. ఇంతలో నాటకీయంగా లీలాకృష్ణ, సురేష్, శంకర్‌లు వెళ్లి కలవగా తనను దూషించాడని ఆర్ఐ లక్ష్మీనారాయణ, తాహశీల్దార్ మధుసుదన్ రావుకు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ జరపమని తాహశీల్దార్ పోలీసులను కోరారు. అయితే రాజకీయ ఒత్తిళ్లతో అత్యుత్సాహం ప్రదర్శించిన రామచంద్రాపురం పోలీసులు ఏకంగా లీలాకృష్ణ, సురేష్, శంకర్‌లపై కేసు నమోదు చేశారు. న్యాయం అడిగిన రిపోర్టర్ లీలాకృష్ణ, సురేష్, శంకర్‌లపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఫెడరేషన్ ఖండిస్తోంది. బే షరతుగా పోలీస్ కేసు ఉపసంహరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉద్యమం నిర్వహిస్తుందని హెచ్చరించారు.

పురిటి బిడ్డను ఇసుకలో పూడ్చిన తల్లి

చేతిపై కుక్కలు కొరకడంతో ఇన్ఫెక్షన్ సోకి మృతి చెందిన శిశువు

మృతి చెందిన పాప

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: పేగుతెంచుకు పుట్టిన నవజాత శివువును మానవత్వం లేకుండా రోడ్డు పక్కనే ఇసుకలో పూడ్చి అమ్మతనానికే మచ్చగా మిగిలింది ఓ మహిళ. ఈ సంఘటన సోమవారం వరదయ్యపాలెంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని యువతి బస్టాండు సమీపంలో పాపకు జన్మనిచ్చింది. అనంతరం పట్టణంలో పద్మావతి ఫ్యాన్సీ స్టోర్, శరవణ స్టోర్ దుకాణం సమీపంలో రోడ్డు పక్కనే ఆ పసికందుని ఇసుకలో బోర్లా పూడ్చి వెళ్ళి పోయింది. సోమవారం ఉదయం పారిశుధ్య కార్మికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించిన తర్వాత హమాలీలు కొన ఊపిరితో ప్రాణాలతో ఉన్న ఆ పసికందుని ఆసుపత్రిలో చేర్చారు. ఆ పసికందు చేతిని కుక్కలు కరవడంతో చేతికి గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం తిరుపతి, రుయా హాస్పిటల్‌కు తరలించారు. కుక్కలు కరవడంతో ఇన్ఫెక్షన్‌కి గురైన శిశువు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇటువంటి అకృత్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్వర్ణరథంపై శ్రీనివాసుడు



ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం సాయంత్రం 4 గంటలకు శ్రీవారు బంగారు తేరులో విహరిస్తూ, భక్తుల్ని తన కృపాకటాక్షాలతో అనుగ్రహించారు. దాసభక్తుల నృత్యాలతోను, భజనబృందాల కోలాహలం, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధులలో రమణీయంగా స్వర్ణరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి స్వర్ణ రథాన్ని లాగారు. స్వర్ణ రథోత్సవంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య, కళా ప్రదర్శనలు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు, సోమవారం ఉదయం నిర్వహించిన హనుమంత వాహన సేవలో దేశం నలుమూలల నుండి విచ్చేసిన ప్రసిద్ధ కళాబృందాలు తమ అద్భుతమైన ప్రదర్శనలతో వాహనసేవకు ఆధ్యాత్మిక శోభను, విశేషమైన కళాత్మకతను తీసుకొచ్చాయి. మొత్తం 26 కళాబృందాలు పాల్గొన్నాయి. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 607 మంది కళాకారులు తమ ప్రదర్శనలను ఇచ్చారు. దేశంలోని 18 రాష్ట్రాల నుండి బృందాలు ఈ సేవలో భాగమయ్యాయి. కేరళ, తమిళనాడు, కర్ణాటక, హర్యానా, ఛత్తీస్‌గఢ్, గోవా, తెలంగాణ, ఒడిస్సా, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, బీహార్, మణిపూర్, పంజాబ్, జమ్ము కాశ్మీర్ వంటి 15కు పైగా రాష్ట్రాల నుంచి వచ్చిన ఈ సాంప్రదాయ నృత్యాలు, ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. కేరళ నుంచి వచ్చిన యక్షగానం (నవదుర్గ), తమిళనాడు నుంచి పాండిచ్చేరి ఫోక్ డాన్స్, మైలట్టం, కర్ణాటక నుంచి పిన్నాల్ ఆండాళ్ డాన్స్ వంటి సాంప్రదాయ నృత్యాలు ఆయా ప్రాంతాల సంస్కృతిని, వైవిధ్యతను కళ్లకు కట్టాయి.

గరుడ వాహన సేవ విజయవంత నిర్వహణపై సీఎం అభినందనలు

విశిష్టమైన శ్రీవారి గరుడ వాహన సేవను అద్భుతంగా నిర్వహించినందుకు టీటీడీ, జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. తన అధికారిక ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ల ద్వారా ఆయన స్పందించారు. గరుడ వాహన సేవలో పాల్గొనేందుకు తరలివచ్చిన 3 లక్షల మందికిపైగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారికి అపూర్వమైన అనుభూతిని అందించినం దుకు సంతోషం వ్యక్తం చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన టీటీడీ పాలకమండలి, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, జిల్లా అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



కొల్హాపూర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ చైర్మన్

ప్రజాశక్తి - తిరుమల: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొల్హాపూర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సోమవారం టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు దంపతులు టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్దకు చేరుకున్న చైర్మన్ దంపతులకు ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ దంపతులు పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకుని వెళ్ళి అమ్మవారికి సమర్పించి దర్శనం చేసుకున్నారు. అర్చకులు ఆశీర్వాదం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రీవెన్సడేకి 4 అర్జీలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల కేంద్రం, తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్సడేకి 4అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ శైలకుమారి తెలిపారు. భూమి సర్వే కొరకు 1, భూమి ఆక్రమించరని 1, పంచాయతీరాజ్ సమస్యలు కొరకు 1, నివేశ స్థలం కోసం 1 వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ గోవర్ధన్, ఏపీఎం మునిరజా తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ గ్రీన్ ఉత్సవ్‌లో భాగంగా మెనేజ్‌మెంట్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా క్లీన్ గ్రీన్ ఉత్సవ్‌ను పురస్కరించుకుని తూకివాకం, ఇంటిగ్రేటెడ్ సాలీడ్ వేస్ట్ మెనేజ్మెంట్ ప్లాంట్ ఆవరణలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పోరేషన్ కమిషనర్ మౌర్య మొక్కలు నాటారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి, సదానందం , అధికారులు, సిబ్బంది కలిసి ప్లాంట్‌లో సుమారు ఐదు వందల మొక్కలు నాటారు. అక్టోబర్ రెండవ తేది వరకు జరిగే స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలలో ప్రజలంతా ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ గ్రీన్ ఉత్సవ్‌లో భాగంగా మొక్కలు నాటుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఏసిపి లు మూర్తి, మధు, మేనేజర్ హసీమ్, తదితరులు పాల్గొన్నారు.

పార్కులో క్రీడా పరికరాలు మార్చండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి వినాయక సాగర్ పార్కులో అనేక సమస్యలున్నాయని వాటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో తాము ఆందోళనకు దిగుతామని తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నగరపాలక సంస్థ కమిషనర్‌కు స్పష్టం చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్‌ను కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు చిత్తూరు శివశంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయన నరేంద్ర బాబు తిరుపతి కాంగ్రెస్ పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు గొడుగుచింతల గోపి, ఆర్గనైజింగ్ సెక్రటరీ తవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు శ్రీవారి దర్శనం కల్పించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : శ్రీవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన గరుడోత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, విజయవంతానికి కృషి చేసిన ఈవో, ఉద్యోగులకు, ఎఫ్ఎంఎస్ విభాగం సిబ్బందికి, హెల్త్ విభాగం సిబ్బందికి, ఎఫ్ఎంఎస్ కార్మికులకు, హెల్త్ కార్మికులకు, వివిధ విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు, విజిలెన్స్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి సిఐటియు తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో పనిచేసిన ఎఫ్ఎంఎస్, హెల్త్ విభాగం, ఇతర విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు బ్రహ్మోత్సవాల అనంతరం ప్రత్యేకంగా శ్రీవారి దర్శన సౌకర్యం కల్పించాలని సిఐటియు తరపున విజ్ఞప్తి చేశారు.

డీఎస్సీలో ఎంపికైన వారికి సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:కూటమి పాలనలోనే డీఎస్సీలో ఉపాధ్యాయులకు ఉద్యోగాలు లభించాయని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కచ్చపి ఆడిటోరియంలో డీఎస్సీలో ఉద్యోగాలు సంపాదించిన వారిని తిరుపతి నారాయణ డిఎస్సి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయ శిక్షణ పొంది, ప్రభుత్వం నిర్వహించనున్న డీఎస్సీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు, తిరుపతి నారాయణ డిఎస్సీ కోచింగ్ సెంటర్ ఒక వరమని తెలిపారు.మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొట్టమొదటి ఫైలు డీఎస్సీ నియామకలపై సంతకం పెట్టడం గొప్ప విషయం అన్నారు. నారాయణ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ నారాయణ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగస్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, నవీన్ కుమార్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, నాయకులు పులిగోరు మురళీకృష్ణారెడ్డి. సురేంద్ర రెడ్డి, నారాయణ డీఎస్సీ స్టాఫ్, ఉద్యోగులు సాధించిన వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడిపై దాడి చేసిన తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి : సిఐటియూ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భవన నిర్మాణ కార్మికునిపై దౌర్జన్యం చేసిన ఎమ్మార్వోపై చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునిరాజా, శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కోట, గాంధీ విగ్రహం సెంటర్ వద్ద నిర్మాణ పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు పెద్ద వెంగయ్యపై దౌర్జన్యంగా ఇటుకరాళ్లతో, కట్టెలతో, వీధి రౌడీల చేసిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్వోపై చర్యలు తీసుకోవాలని కోరారు. మండల మెజిస్ట్రేట్ స్థాయి అధికారి, విచక్షణ కోల్పోయి భవన నిర్మాణ కార్మికులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన తహశీల్దారుపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రేపు "గరం గరం చాయ్" పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఆర్.సి.కృష్ణ స్వామిరాజు రచించిన "గరం గరం చాయ్" పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం సాయంత్రం జరుగనుందని చాప్టర్ చైర్మన్ డాక్టర్ జి.ఎస్.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 4.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్రిపుర, దమ్మ దీప అంతర్జాతీయ బౌద్ధ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం.పి.నరసింహారావు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. కాగా, పుస్తక రచయిత ఆర్.సి.కృష్ణస్వామిరాజు పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ కార్యవర్గ సభ్యులుగా సేవలందిస్తున్నారు.

మృతులకు ఎమ్మెల్యే నాని నివాళి

ప్రజాశక్తి - పాకాల:పాకాల మండలం, దామలచెరువు, మొగరాల, పంచాయతీలలో, మల్లప్పగారిపల్లి, తలారిపల్లి, కృష్ణాపురం గ్రామాలకు చెందిన వేదగిరి జయమ్మ, తలారి నాదముని, రెడ్డి వెంకట్రెడ్డి నాయుడులు మృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం వారి పార్థివదేహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోద్రెజ్ ఆగ్రోవెట్‌చే మై గ్రేసియా, మై ప్రైడ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:ప్రముఖ విభిన్న వ్యవసాయ-వ్యాపార సమ్మేళనంలో ఒకటైన గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (గోద్రెజ్ ఆగ్రోవెట్), భారతీయ వ్యవసాయ రైతుల్లో పెంచబడిన ఆరోగ్యకరమైన నారుమొక్కల ప్రాముఖ్యతను చెప్పే 'మై గ్రేసియా, మై ప్రైడ్' అనే పేరుతో దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించిందని ఆ సంస్థ [illegible] సీఈఓ ఎన్.కె.రాజవేలు తెలిపారు. రైతులను ప్రోత్సహించాలనే, ఉత్తమ ప్రమాణికతతో వారికి అవగాహన కల్పించడానికి కంపెనీ స్పెన్ అండ్ విన్ పోటీని కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గ్రేసియా ప్యాక్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి క్యాష్‌బ్యాక్ గెలుచుకునే అవకాశంతో రైతులను ప్రోత్సహిస్తున్నారు. క్యాష్‌బ్యాక్ పొందాలంటే, బ్యాంక్ ఖాతాకు లింక్ చేయబడిన మొబైల్ నంబర్‌ను నమోదు చేయాలని తెలిపారు.

ఆ దారిలో వెళితే ఇక అంతే సంగతులు

■ ప్రజల ప్రాణాలకు ప్రమాదంగా మారిన రైల్వే అండర్ బ్రిడ్జి ■ అధికారుల నిర్లక్ష్యానికి మూల్యం చెల్లిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - నాయుడుపేట: రైల్వే గేట్ల ముందు ప్రజలు వేచి ఉండకూడదనో లేక రైల్వే గేట్లు దాటుతూ ప్రజలు ప్రమాదాల గురవుతున్నారనో ప్రజల శ్రేయస్సు కోసమో లేక రైల్వే సిబ్బందిని తగ్గించుకునేందుకో ఎందుకో గాని మొత్తానికి ఈ మధ్యకాలంలో రైల్వే గేటు సమీపంలో దాదాపుగా అన్ని గేట్లు వద్ద అండర్ బ్రిడ్జిలు వెలిశాయి. ఈ బ్రిడ్జిల కారణంగా ప్రజలు సమయాన్ని వృధా చేసుకోకుండా ఎక్కడ ఏ గేటు ముందు వేచి ఉండకుండా అండర్ బ్రిడ్జి ద్వారా వారి గమ్యస్థానానికి చేరుకుంటున్నారు.వర్షాల సమయంలో మాత్రం ప్రతి బ్రిడ్జి లోను నీళ్లు నిలబడి ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. కాకపోతే ఈ సమస్యలు తాత్కాలికమే కాబట్టి ఎలాగోలా సర్దుకుంటూ గమ్యం చేరుకుంటున్నారు. ఇదిలా ఉంటే కొన్ని బ్రిడ్జిలు మాత్రం ప్రజలు ప్రాణాలు పోయేంత ప్రమాదకరంగా నిర్మించారని చెప్పవచ్చు. తిరుపతి జిల్లా నాయుడుపేట పరిధిలో దాదాపుగా ఆరు చోట్ల ఆరు రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మించారు. వీటిలో కొన్ని ప్రజాజీవనానికి ఇబ్బందికరంగా మారాయి. రైల్వే అధికారులు వీటిని తరచూ పరిశీలిస్తున్నారో లేదో తెలియదు గాని కొన్ని బ్రిడ్జిల దారులు మరి దుర్భరంగా మారి వాహన చోదకులకు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వీటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది మునిసిపాలిటీ పరిధిలోని చంద్రబాబునాయుడు నగర్, అన్నమేడు బ్రిడ్జిలు. అన్నమేడు రైల్వే బ్రిడ్జి వద్ద ప్రారంభించిన కొద్ది కాలానికి రోడ్డు గుంతలు పడిపోయి ఆ దారిలో వాహనాలు నడిపేందుకు వాహనదారులు ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. గుంతల మయంగా మారిన ఈ రోడ్డులో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్న ఇక హాస్పిటలే గతి. ఈ మార్గం గుండా నిత్యం ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాలు వరకు వందల సంఖ్యలో తిరుగుతూ ఉంటాయి. నాయుడుపేట పట్టణం నుంచి చుట్టుపక్కల పల్లెలకు మరీ ముఖ్యంగా కోట, ఓజిలి, గూడూరు, నెల్లూరు ఇలా ముఖ్య ప్రదేశాల రాకపోకలకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, ఆర్టీసీ బస్సులు పదుల సంఖ్యలో తిరుగుతుంటాయి. వాహనాల డ్రైవర్లకు ఆ దారిలో

వెళ్లాలంటే వెన్నులో వణుకు పుట్టే పరిస్థితులు నెలకొన్నాయి. ఇకపోతే ప్రజా జీవనానికి అత్యంత ప్రమాదకరంగా మారిన చంద్రబాబు నాయుడు నగర్ లోని అండర్ రైల్వే బ్రిడ్జి ఈ బ్రిడ్జిని ప్రజా జీవనం కోసం వేశారో లేక అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలి గనుక ప్రజలు వాళ్ల సావు వాళ్ళు సస్తారులే అని నిర్లక్ష్యంగా వేశారో ఆ ప్రాంత ప్రజలకు అంతుపట్టని సమస్యగా మిగిలిపోయింది. ఈ బ్రిడ్జిని నాయుడుపేటలో వేసిన అన్ని బ్రిడ్జిల కంటే చాలా భిన్నంగా నిర్మించారు. వాహన చోదకులకు ఆ దారిలో వెళ్లడమంటే సవాల్ అనే చెప్పాలి. ఆ బ్రిడ్జిని చాలా లోతుగా ఎదురుగా వస్తున్న వాహనం కనిపించనంత ఎత్తుగా, వంకరగా ప్రమాదాలకు అత్యంత దగ్గరగా నిర్మించారు.ఆ దారిలో ప్రమాదం జరగని రోజంటూ లేదు ఆ దారిలో వెళ్లే వారెవరైనా సరే మృత్యువుని పలకరించి రావాల్సిందే. ఆ మార్గాన్ని ఉపయోగించడం అంటే అదో పెద్ద అడ్వెంచర్ అనే చెప్పొచ్చు. చంద్రబాబు నాయుడు కాలనీ వాసులు పట్టణంలోకి రావాలంటే ఇది ఒక్కటే మార్గం ఆ దారిలో కాలనీ వాసుల బాధలు వర్ణనాతీతం.

రైల్వే అధికారులు మా ప్రాణాలు బలి తీసుకుంటున్నారు : అబ్దుల్లా సిఐటియు

ప్రజా జీవనంపై ఏమాత్రం బాధ్యత లేకుండా ఇలాంటి ప్రమాదకరమైన బ్రిడ్జిలు ఏర్పరిచి ప్రజల ప్రాణాలతో రైల్వే అధికారులు ఆటలాడుకుంటున్నారని చంద్రబాబు నాయుడు కాలనీ వాసి సిఐటియు నాయకులు ఎస్.కె అబ్దుల్లా అన్నారు. ఈ బ్రిడ్జి కింద వారంలో తప్పనిసరిగా రెండు మూడు ప్రమాదాలు జరుగుతున్నాయని ఇంత పెద్ద శాఖ అయినా రైల్వే శాఖలోని అధికారులు ఏమాత్రం అవగాహన లేకుండా ఇలాంటి ప్రమాదకరమైన దారి ఎలా ఏర్పాటు చేస్తారని మండిపడ్డారు. కాలనీ నుంచి పట్టణంలోకి వెళ్లాలంటే ఇది ఒక్కటే దారి అని మా కాలనీవాసులు ప్రతి ఒక్కరు తప్పని సరిగా రోజులో రెండు మూడు సార్లు అయినా జీవనోపాధి కోసం నాయుడుపేట పట్టణంలోకి వెళ్ళవలసి ఉంటుందని మా ఇంట్లోని వారు పట్టణంలోకి వెళ్ళిన వారు ప్రాణాలతో తిరిగి వస్తారా అనే భయంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారన్నారు. ఈ నెలలో జరిగిన చిన్న చిన్న ప్రమాదాలు పక్కన పెడితే మూడు ప్రమాదాలలో దాదాపుగా ఆరేడు మంది మృత్యువాత పడవలసిందని అదృష్టం బాగుండి, ప్రాణాలతో బయట పడ్డారని వారం రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో ఇప్పటికీ ఒక వ్యక్తి నెల్లూరు హాస్పిటల్లో ప్రాణాలతో పోరాడుతున్నాడని తెలిపారు. ఈ బ్రిడ్జి ఏర్పడ్డాక ఎన్ని ప్రమాదాలు జరిగినా ఎంత మంది చచ్చిపోయినా ఏ ఒక్క అధికారి కానీ, నాయకులు గానీ ఇటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా నాయకులు అధికారులు కల్పించుకుని ఈ దారిని ప్రజాజీవనానికి అనుగుణంగా మార్పులు చేసి ఈ ప్రమాదాలకు స్వస్తి పలకాలని ఆ కాలనీ వాసుల తరపున వేడుకున్నారు.

మున్సిపల్ కార్మికులపై దాడులు ఆపాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :ఇటీవల అనంతపురం, గుంటూరు నగరంలో మున్సిపల్ కార్మికులపై జరిగిన దాడులు ఆపాలంటూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో గూడూరులో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న పద్మపై జనసేన కార్పొరేటర్ దాడి చేసి, నీచంగా మాట్లాడటం దారుణమన్నారు. అదేవిధంగా అనంతపురం, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో వాటర్ సెక్షన్‌లో పనిచేస్తున్న గౌరీ శంకర్ పై అధికారులు అక్రమ కేసులు బనాయించడం ఎంత వరకు సబబన్నారు. ఈ నేపథ్యంలో సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో నిరసన చేపట్టినట్లు తెలిపారు. కార్మికులపై దాడి చేసి, ఒత్తిడి పెంచి, నిర్బంధంగా పనులు చేయించడం వంటివి మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.రమేష్, భూలోక మురళి, గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, పుట్టా శంకరయ్య, సహాయ కార్యదర్శి ఎన్.వెంకటరమణ, జి.మణి, శాంతి వర్ధన్, డి.మణెమ్మ, కె.విజయ, బి.పెంచలమ్మ, కె.పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీలో 27 వార్డులు ఉన్నాయని, అభివృద్ధి పనులు అన్ని వార్డుల్లో సమానంగా చేపట్టాలని మున్సిపల్ సాధారణ సమావేశంలో వైస్ ఛైర్మన్లు, వైసీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. టిడిపి కౌన్సిలర్‌కు మాత్రం పనులు కేటాయిస్తున్నారని ఆరోపించారు. అలాంటివి ఏమి జరగలేదని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. సోమవారం పుత్తూరు మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ ఏ.హరి, అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అజెండా చదివి వినిపించడం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్‌లో రాత్రిళ్లు వైద్య సిబ్బంది ఉండడం లేదని, పంటి డాక్టర్ లేరని తెలిపారు. డ్రైనేజీ, పైప్‌లైన్ మరమ్మతులు, వీధి దీపాలు, దొంగతనాలు, దోమల సమస్య, పారిశుధ్య సమస్య, కుక్కల బెడద, పార్కుల్లో మరుగుదొడ్ల ఏర్పాటు, మరాఠి గేట్ వద్ద సర్వీసు రోడ్డు ఏర్పాటు, షాది మహల్ ప్రారంభం వంటి సమస్యలను చర్చించారు. స్పందించిన కమిషనర్ స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ఏర్పాటు చేస్తామని చెప్పారు. టిడిపి కౌన్సిలర్ గాలి జీవరత్నం నాయుడు మాట్లాడుతూ నగిరి ఎమ్మెల్యే కృషితో, ప్రభుత్వ హాస్పిటల్‌కు 100 పడకలు మంజూరు అయిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్, వైస్ చైర్మన్లు జయప్రకాష్, శంకర్, డి ఇ లోకేష్, ఏ.ఈ రమేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జీఎస్టీ ఫలాలు అందరికీ అందాలి

షాపింగ్ మాల్స్‌లో కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై ప్రతి వినియోగదారుడికి అవగాహన కలిగేలా ప్రచారం చేయాలని నగరపాలక సంస్థ అధికారులను కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. తగ్గిన జీఎస్టీ ధరల అమలుపై డి.మార్ట్, తదితర షాపింగ్ మాల్స్‌ను సోమవారం సాయంత్రం అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించి, వినియోగదారులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వరలక్ష్మి, రెవెన్యూ ఆఫీసర్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జీఎస్టీని తగ్గింపుతో పలు వస్తువులు తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చాయని, తగ్గిన జిఎస్టి గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వాణిజ్య పనుల శాఖ తిరుపతి రీజనల్ ఎన్ఫోర్స్మెంట్ అడిషనల్ కమిషనర్ నాగేంద్ర వెల్లడించారు. గూడూరు, టవర్ క్లాక్ సెంటర్ నుండి వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, వ్యాపారస్తులతో కలిసి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పనుల శాఖ గూడూరు అసిస్టెంట్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ ,తాసిల్దార్ ప్రసాద్ ,మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ,సెల్ టాక్స్ ప్రాక్టీషనర్ కోటా సునీల్ కుమార్ , వ్యాపారస్తులు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు .

ప్రజాశక్తి - నాయుడుపేట: కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 ఫలాలు ప్రజలందరికీ అందించాలని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అన్నారు.



జిఎస్టీ అవగాహన పత్రాలను పంచుతున్న కమిషనర్ ఫజులుల్లా

సోమవారం నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సూపర్ జిఎస్‌టి,సూపర్ సేవింగ్స్ పై నాయుడుపేట పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమిషనర్ షేక్ ఫజులుల్లా తహసిల్దార్ రాజేంద్ర, కమర్షియల్ టాక్స్ అధికారులు రమణయ్య ప్రవీణ్ కుమార్ లు సూపర్ జిఎస్టి 2.0 అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన 90శాతం వస్తువులు ధరలు తగ్గి ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు.ప్రజల కొనుగోలు శక్తి కూడా పెరుగుతుందన్నారు.జీఎస్టీ 2.0 వలన తగ్గిన ధరల వివరాలను ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని జీఎస్టీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, మున్సిపల్ సిబ్బంది,సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లపై 22ఎ నిషేధం ఎత్తివేత

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:తిరుపతి, ఆటోనగర్ స్థలాల రిజిస్ట్రేషన్లపై అమల్లో ఉన్న 22ఎ పై నిషేధాన్ని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీని వల్ల ఆటోనగర్‌లో స్థలాల యజమానులకు దీర్ఘకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ 1997లో 18.25 ఎకరాల్లో 338 స్థలాలు అభివృద్ధి చేసి, వీటిలో 337 స్థలాలు ఆటోమొబైల్ యూనిట్లకు కేటాయించబడ్డాయని, 29.09.2025 నాటికి ఒక్క స్థలం కూడా ఖాళీగా లేదని తెలిపారు. 20.10.2018 నుంచి తిరుపతి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్కరంపల్లె గ్రామం సర్వే నం.74/7, మంగళం సర్వే నం.95/2 నిషేధిత జాబితాలో ఉన్నాయని పేర్కొంటూ రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అనేకమంది చేసిన విజ్ఞప్తులను పరిశీలించి, సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

రాస్ చేయూతతో ఆటో వితరణ

ప్రజాశక్తి - రేణిగుంట, మంగళం : తిరుపతి జిల్లా, రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని చైతన్యపురంలో పి.సతీష్ కుటుంబ సభ్యులు నివసిస్తూ వృత్తి రీత్యా డ్రైవర్ గా పనిచేస్తున్న సమయంలో అతని కాళ్ళు,చేతులు తీవ్రంగా పక్షవాతం సమస్య రావడంతో ఆసుపత్రికి సుమారు 20 లక్షల రూపాయలు వరకు ఖర్చు పెట్టడం, ఈ ప్రభావంతో జీవనం సాగించలేకపోవడంతో జిల్లా కలెక్టర్ ను కలిసి సహాయపడాలని బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబుతో చర్చించి, రాస్ స్వచ్ఛంద సంస్థను సంప్రదించి ఆర్థిక చేయూత అందించాలని ఆదేశించడంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బంగారు కుటుంబం పి4 విధానంలో దత్తత కార్యక్రమంలో భాగంగా వారికి ఎంతో ఉపయోగపడే రెండు లక్షల 80 వేల రూపాయలకు పైగా విలువ చేసే ఆటోను రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు చేతుల మీదుగా సతీష్ కుటుంబ సభ్యులకు నూతన సిఎన్జి ఆటో తాళాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సోమవారం జిల్లా కలెక్టరేట్లో అందించారు. ఈ ఆటో ద్వారా ఆర్థికపరంగా ఎదుగుతూ కుటుంబాన్ని, పిల్లలను బాగా చదివించుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సోనాటా దసరా ఫెస్టివ్ కలెక్షన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: దేశవ్యాప్తంగా పండుగల సీజన్ ప్రారంభం కావడంతో, సోనాటా ఫెస్టివ్ కలెక్షన్ 2.0ను ఆవిష్కరించిందని సోనాటా ప్రొడక్ట్ హెడ్ నిశాంత్ మిట్టల్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఫెస్టివ్‌కలెక్షన్ 2.0 అనేది ఈ పండుగ సీజన్‌ను స్టైలిష్‌గా జరుపుకోవడం కోసమేనన్నారు. బహుమతిగా ఇవ్వడానికి, అలంకరించుకోవడానికి లేదా పండుగలను ఆస్వాదించడానికి ప్రతి వాచ్ శాశ్వతమైన జ్ఞాపకాలను అందిస్తుందని పేర్కొన్నారు. పురుషుల కోసం సోనాటా ఫెస్టివ్ కలెక్షన్ 2.0లోని వాచీలునైపుణ్యాన్ని, సొగసును చూపిస్తాయన్నారు. మహిళల కోసం సోనాటా తీసుకొచ్చిన వాచీల సేకరణలో మెరిసే మెష్బ్రాస్‌లెట్స్, స్టడ్స్‌తోపాటు వివిధ ఆకారాలతో కూడిన మెరిసే రోజ్‌గోల్డ్ పట్టీలు రూపంలో ఉన్నట్లు తెలిపారు.

విద్యుత్ పోల్స్ మార్చాలని వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తడుకు గ్రామంలో దారికి అడ్డుగా ఉన్న విద్యుత్ పోల్స్‌ను తొలగించాలని తిరుపతి కలెక్టరేట్ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య మాట్లాడుతూ, తడుకు వద్ద దారికి అడ్డంగా విద్యుత్ పోల్స్ ఉన్నాయని, దీంతో ఎగువగూళూరు దళితులకు వాహనాలకు రాను, పోనూ ఇబ్బందిగా ఉందని తెలిపారు. అత్యవసర సమయాల్లో 108 వాహనం కూడా రావడం కష్టంగా ఉందన్నారు. కలెక్టర్ స్పందించి విద్యుత్ పోల్స్‌ను తొలగించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు సునీల్, శ్రీనివాసులు, భూపాల్, కేశవులు, సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

క్రైం న్యూస్

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి

మృతి చెందిన పెయింటర్ లోకేష్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ కోళ్ల ఫారాలలో ఇంటి నిర్మాణాలకు సంబంధించి పెయింటింగ్ చేస్తున్న లోకేష్ అనే పెయింటర్ విద్యుత్ షాక్‌కు గురై మరణించారు. విద్యుత్ షాక్‌కు గురైన వెంటనే గుర్తించిన తోటి కార్మికులు అతనిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించడానికి ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. మృతుడు లోకేష్‌కు భార్య కవిత రాణి, కుమార్తె బ్రైటీ ఉన్నారు. ఇటీవల మరో కుమార్తె క్యాన్సర్ వ్యాధితో చనిపోయినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి తీరుచానూరు పోలీసులు సమాచారాన్ని సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగన్నాథరెడ్డి తెలిపారు.

గంగమ్మ ఆలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్న నాగరాజు రెడ్డి ఆదివారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. నాగరాజు రెడ్డి అంత్యక్రియల కోసం గంగమ్మ గుడి చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ 25 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని సోమవారం చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులు గుణ, భాగ్యవల్లి, రాజా రుద్ర కిషోర్, వరలక్ష్మి, విమల, చంద్రశేఖర్, శ్యామల, మధులత, వినుకొండ లక్ష్మణరావులు మృతుని కుటుంబానికి అందజేశారు. నాగరాజు రెడ్డి మృతదేహానికి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేవాదాయ శాఖ తరపున కూడా 15 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఈవో జయ కుమార్ మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మహేష్ యాదవ్ మాట్లాడుతూ నాగరాజు రెడ్డి కుటుంబానికి ఆలయం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని బెనిఫిట్స్ అందేలా చూస్తామని తెలిపారు.

పాకాల జంక్షన్‌లో ఆగిన పలు రైళ్లు

■ ప్రయాణికులకు నానా ఇక్కట్లు

■ కొత్తకోట సమీపంలో ట్రాక్ అడ్డం పడ్డ ట్రాక్షన్ ఇంజన్

ప్రజాశక్తి - పాకాల: పాకాల రైల్వే జంక్షన్‌లో సోమవారం 11 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు పలు రైళ్లు ఆగిపోయాయి. దీనితో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాల్లోకెళితే పాకాల-చిత్తూరు మార్గంలోని కొత్తకోట వద్ద విద్యుత్ మరమత్తు చేసే ట్రాక్షన్ ఇంజన్ ట్రాక్‌కు అడ్డం పడడంతో మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ మార్గంలోని రైళ్లను రద్దు చేశారు. ఇందులో భాగంగా జయంతి ఎక్స్ప్రెస్, రామేశ్వరం ఎక్స్ప్రెస్, వెంకటాద్రి ఎక్స్ప్రెస్‌లతోపాటు లోకల్ రైళ్లను కూడా రద్దు చేశారు. పలు రైళ్లు పాకాల రైల్వే జంక్షన్‌లోను, మరికొన్ని చిత్తూరు ముంగిలిపట్టు రైల్వే స్టేషన్లో ఆపేశారు.

అసలు కారణం.. పాకాల జంక్షన్ నుంచి చిత్తూరు మార్గంలోని కొత్తకోట వద్ద ట్రాక్ మరమతు పనులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ట్రాక్షన్ మరమ్మతు చేసే ఇంజన్ ఆ మార్గంలో వెళ్లడంతో ప్రమాదానికి గురై ప్రక్కకు వాలింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు వెంటనే ఆ మార్గంలోని రైళ్లు ఎక్కడికక్కడ రద్దు చేశారు. పలు క్రేన్లు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. సుమారు ఆరు, ఏడు గంటలు శ్రమించి చక్కదిద్దారు.

సింగిల్ లైన్‌తో సమస్యలు.. తిరుపతి కాట్పాడి మధ్య అనునిత్యం 20కి పైగా ట్రైన్లు, గూడ్స్ రైళ్లు నడుస్తున్నప్పటికీ, సింగల్ లైన్ ఉండడంవల్ల ట్రాఫిక్ ఎక్కువ కావడం సమస్యకు కారణం అవుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. సుమారు వంద కిలో మీటర్లు కూడా డబుల్ లైన్ లేక పోవడం సమస్యలకు కారణం అవుతుంది. రైల్వే అధికారులు స్పందించి డబుల్ లైన్ ఏర్పాటు చెయ్యాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో జయశంకర్

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు, భౌతిక శాస్త్ర విభాగం, విశ్రాంత ఆచార్యుడు ఆచార్య సికె జయశంకర్ వరుసగా ఆరో సంవత్సరం ప్రపంచంలోని టాప్ 2% శాస్త్రవేత్తలలో స్థానం పొందారని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ సర్వే ప్రకటించింది. ఆయన 342 పరిశోధనా పత్రాలను ప్రచురించారు.34 మంది విద్యార్థులు ఆయన పర్యవేక్షణలో పిహెచ్‌డి పొందారు. ఆయన వివిధ హోదాల్లో యుఎస్ఎ, యూరప్, మెక్సికో , ఆసియా దేశాలను కూడా సందర్శించారు. గూగుల్ స్కాలర్ సైటేషన్ ప్రకారం, ఆయన పత్రాలను 72 హెచ్-ఇండెక్స్ ,264 ఐ10-ఇండెక్స్‌తో 15857 సార్లు ఉదహరించారు. ఈ సందర్భంగా ఇంచార్జీ వైస్-ఛాన్సలర్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, విశ్వవిద్యాలయ భౌతికశాస్త్ర విభాగాధిపతి ఆచార్య దేవప్రసాద్ రాజును అభినందించారు.

IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE :: SRIKALAHASTI.
I.A.NO. 274 OF 2024
O.S.NO. 11 OF 2023

Between:-
K. Suseela ...Petitioner/Plaintiff
And:-
K. Gangamma and others ...Respondents/Defendants

To
Respondent No.21
Pillapalem Venkata Subba Reddy, S/o P. Ranaga Reddy, residing at Gajulamandyam Post & Village, Renigunta Mandal, Tirupathi District.
Respondent No.50
Kalavkolu Anada Naidu, S/o K. Srinivasulu Naidu, residing at residing at Velamapalem Village, Srikalahasti Post & town, Tirupathi District

NOTICES TO RESPONDENTS NO. 21and 50

Please take Notice that the above Petitioner/Plaintiff field the above petition I.A.NO. 274 OF 2024 IN O.S.NO.11 OF 2023 under Section 5 of Limitation Act to condone the delay of 913 days in filing the petition under Order XXII Rule 4 of C.P.C. and the matter is posted to 17-10-2025 for your appearance either in person or through your counsel at 10.30 a.m., in the above court, in the event of your absence, the matter will be decided ex-parte.

Date of hearing: 17-10-2025.
(BY ORDER OF COURT)
G.RAJESWARA RAO,
ADVOCATE FOR PETITONER/PLAINTIFF.

IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE :: SRIKALAHASTI.
I.A.No. 273 OF 2024
O.S.NO. 11 OF 2023

K. Suseela ... Petitioner/Plaintiff
And:-
K. Gangamma and others ...Respondents/Defendants

To
Respondent No.21
Pillapalem Venkata Subba Reddy, S/o P. Ranaga Reddy, residing at Gajulamandyam Post & Village, Renigunta Mandal, Tirupathi District.
Respondent No.50
Kalavkolu Anada Naidu, S/o K. Srinivasulu Naidu, residing at residing at Velamapalem Village, Srikalahasti Post & town, Tirupathi District

NOTICES TO RESPONDENTS NO. 21and 50

Please take Notice that the above Petitioner/Plaintiff field the above petition I.A.NO. 273 OF 2024 IN O.S.NO.11 OF 2023 under Order IX Rule 9 of C.P.C. to set aside the dismissal order dated 19-07-2023 and the matter is posted to 17-10-2025 for your appearance either in person or through your counsel at 10.30 a.m., in the above court, in the event of your absence, the matter will be decided ex-part.

Date of hearing: 17-10-2025.
(BY ORDER OF COURT)
G.RAJESWARA RAO,
ADVOCATE FOR PETITONER/PLAINTIFF.

IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE :: SRIKALAHASTI.
I.A.NO. 272 OF 2024
O.S.NO. 11 OF 2023

Between:-
K. Suseela ... Petitioner/Plaintiff
And:-
K. Gangamma and others ...Respondents/Defendants

To
Respondent No.21
Pillapalem Venkata Subba Reddy, S/o P. Ranaga Reddy, residing at Gajulamandyam Post & Village, Renigunta Mandal, Tirupathi District.
Respondent No.50
Kalavkolu Anada Naidu, S/o K. Srinivasulu Naidu, residing at residing at Velamapalem Village, Srikalahasti Post & town, Tirupathi District

NOTICES TO RESPONDENTS NO. 21 and 50

Please take Notice that the above Petitioner/Plaintiff field the above petition I.A.NO. 272 OF 2024 IN O.S.NO.11 OF 2023 under Section 5 of Limitation Act to condone the delay of 76 days in filing the petition under Order IX Rule 9 of C.P.C. and the matter is posted to 17-10-2025 for your appearance either in person or through your counsel at 10.30 a.m., in the above court, in the event of your absence, the matter will be decided ex-parte.

Date of hearing: 17-10-2025.
(BY ORDER OF COURT)
G.RAJESWARA RAO,
ADVOCATE FOR PETITONER/PLAINTIFF.

IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE :: SRIKALAHASTI.
I.A.NO. 275 OF 2024
O.S.NO. 11 OF 2023

Between:-
K. Suseela ...Petitioner/Plaintiff
And:-
K. Gangamma and others ...Respondents/Defendants

To
Respondent No.21
Pillapalem Venkata Subba Reddy, S/o P. Ranaga Reddy, residing at Gajulamandyam Post & Village, Renigunta Mandal, Tirupathi District.
Respondent No.50
Kalavkolu Anada Naidu, S/o K. Srinivasulu Naidu, residing at residing at Velamapalem Village, Srikalahasti Post & town, Tirupathi District

NOTICES TO RESPONDENTS NO. 21and 50

Please take Notice that the above Petitioner/Plaintiff field the above petition I.A.NO. 275 OF 2024 IN O.S.NO.11 OF 2023 under Section 5 of Limitation Act to condone the delay of 913 days in filing the petition under Order XXII Rule 4 of C.P.C. and the matter is posted to 17-10-2025 for your appearance either in person or through your counsel at 10.30 a.m., in the above court, in the event of your absence, the matter will be decided ex-parte.

Date of hearing: 17-10-2025.
(BY ORDER OF COURT)
G.RAJESWARA RAO,
ADVOCATE FOR PETITONER/PLAINTIFF.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P. No: 189 / 2025

1. Shaik Shaliha
2. Shaik Farhan Ahmed
3. Shaik Aamira Faziya ...పిటిషనర్లు

Vs.

Nil ....రెస్పాండెంట్

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబర్ కేసులో పిటిషనర్లు సూళ్ళూరుపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో వున్న Shaik Muntaz begam గారి bank safe Locker deposit మొత్తమును మాకు రావలసినదిగా కోరుచూ పై కోర్టులో Succession Certificate కొరకు పిటిషను పెట్టి వున్నందున ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేది. 08-10-2025 పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలసినది.

ఇట్లు
ఎస్. చంద్రమోహన్ రెడ్డి, బి.కాం, బి.ఎల్.,
అడ్వకేట్, గూడూరు.

ORDER 21 RULE 66 CPC
IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE(JUNIOR DIVISION): VENKATAGIRI
E.P.NO. 34/2024 IN
O.S. No.41 OF 2024

Dadi Eswara Reddy ....Petitioner/ Decree Holder
VS
Dasari Paramdamaiah ....Respondent/Judgement Debtor

SALE NOTICE TO RESPONDENT/ JUDGEMENT DEBTOR BY WAY OF SUBSTITUTE SERVICE

Dasari Paramdamaiah, S/o.D.Rama Naidu, Residing at D.No.9-149, Teachers colony, Ashram Street, Venkatagiri Town and Mandal, Tirupathi District.

Take Sale notice that the petitioner/Decree Holder has filed the above Sale E.P. Petitioner/ Decree Holder filed the above Sale E.P. against Respondent/Judgement Debtor for recovery of amount. which stands posted to above matter on 07-10-2025 for your appearance. Hence you are hereby required to appear before the above named court on the aforesaid date at 10.30 a.m. onwards either in person or through an advocate and file your objections else the matter will be dicided as exparte.

Hearing date: 07-10-2025

V.CHENCHU KRISHNAIAH,
ADVOCATE , VENKATAGIRI,
CONTACT NO:9985398129.

శ్రీనిధి చెక్కు పంపిణీ



ప్రజాశక్తి - కేవిబి పురం: కేవిబి పురం, వెలుగు కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రూ. 2 కోట్లు శ్రీనిధి చెక్కులు పంపిణీ చేశారు. మహిళలకోసం ఎన్నో పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టినట్టు తెలిపారు. త్వరలో 18 వయస్సు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500లు పంపిణీ కార్యక్రమం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళలు ఆర్ధికంగా, సామాజికంగా ఎదిగేలా చేయడమే ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పద్మభూషణ్ రాజశ్రీ బిర్లా పుట్టినరోజులు పురస్కరించుకొని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ పిసి రాయల్ మాట్లాడుతూ ఆదిత్య బిర్లా గ్రూప్ వ్యవస్థకు డైరెక్టర్లు ఉన్న రాజశ్రీ పేదలకు విద్య వైద్యాన్ని దగ్గర చేసేందుకు కొట్లాది రూపాయలు వెచ్చిస్తుందన్నారు. కుమార మంగళం బిర్లా చైర్మన్గా ఉన్న ఆదిత్య బిర్లా సంస్థ 48 దేశాలలో 60 శాతానికి మించి వ్యాపారాలు సాగిస్తుందన్నారు. ఆ సంస్థలో సుమారు 2 లక్షల మంది పైగా ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, సామంచి శ్రీనివాస్, బండి మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడిలో పోషణ సంబరాలు

ప్రజాశక్తి -ఏర్పేడు : రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సీడీపీఓ కృష్ణవేణి ఆదేశాల మేరకు పంగూరు సచివాలయంలో 8 వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష, ఐసీడీఎస్ సూపర్వైజర్ రత్నమ్మ మాట్లాడుతూ మహిళలలో రక్తహీనత, పిల్లలలో పౌష్టికాహార లోపం లేకుండా ఉండాలంటే సంపూర్ణ ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రత్నమ్మ, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్స్, సచివాలయ సిబ్బంది గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి నియామకం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి సభ్యులను నియమిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్గా ఉన్న మొక్కల చంద్రశేఖర్రెడ్డి, ఆర్.వెంకటముని, ఎం.గోపినాథ్, మునిరత్నమ్మ, కె.దుర్గా, పి.పాపమ్మ, జి.దేవి, ఎం.గోపాల్రెడ్డి, భారతి, ఎం.యోగానందం, బీవీ.స్వప్నలను సభ్యులుగా, పద్మావతిలను ఎక్స్ అఫిషియో సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఇందులో ప్రధానంగా చంద్రగిరికి చెందిన టీడీపీ నాయకుడు మొక్కల చంద్రశేఖర్రెడ్డి పేరును చైర్మన్ అభ్యర్థిగా ఇదివరకే ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రకటించారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు తమను పాలక మండలి సభ్యులుగా నియమించినందుకు ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలిపారు. పాలకమండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

అశ్వ వాహనంపై శ్రీమూలస్థాన ఎల్లమ్మ విహారం

- గాయత్రీ దేవి గా శ్రీ మూలస్థాన ఎల్లమ్మ - పురవీధుల్లో ఊరేగింపు

- కర్పూర నీరాజనాలు సమర్పించిన మహిళలు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు అశ్వవాహనంపై గాయత్రి దేవిగా భక్తులకు అభయమిచ్చారు. చంద్రగిరి కి చెందిన విజయ భాస్కర్ రెడ్డి, డాక్టర్ మునిరెడ్డి, పాకాల చంద్రశేఖర్ రెడ్డి ఉభయ దాతలుగా వ్యవహరించి ఆశ్వవాహనానికి కావాల్సిన వస్తు సామాగ్రిని సమకూర్చారు. దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం అమ్మవారికి ప్రధాన అర్చకులు అరుణ సూరి సహా అర్చక బృందంతో కలిసి విశేష పూజలు నిర్వహించి అర్చనలు అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు ఉత్సవ విగ్రహాన్ని ఆలయ అలంకార మండపానికి తీసుకువచ్చి సుగంధ ద్రవ్యాలతో శుభ్రపరిచి, పట్టు పీతంబరాలతో అలంకరించి, గాయత్రి దేవి గా ఆశ్వ వాహనంపై అధిష్టించారు. అమ్మవారు ఆశ్వవాహనంపై గాయత్రి దేవి అలంకరణతో అధిరోహించి భక్తులను కటాక్షించారు. అమ్మవారు ఆశ్వ వాహనంపై చంద్రగిరి పురవీధుల్లో ఊరేగగా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఈవో మమత, ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గోపాల్ రెడ్డి, గోపీనాథ్, వెంకటముని, భారతి, మునిరత్నమ్మ, దుర్గ, పాపమ్మ, దేవి, యోగానంద, సప్న పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో (వరల్డ్ హార్ట్ డే) 'ప్రపంచ హృదయ దినోత్సవంలో భాగంగా సోమవారం శ్రీ పద్మావతి ఓ.పి.డి.బ్లాక్ వైయిటింగ్ హాల్‌లో సోమవారం సిపిఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ కార్డియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరీష్ చౌదరి, మెడిసిన్ రెసిడెంట్ వైద్యులు డాక్టర్ సాయికుమార్‌లు మాట్లాడుతూ స్విమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్ ఆదేశాల మేరకు సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. సిపిఆర్ అంటే అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే ప్రక్రియ అని, ఎవరికైన శ్వాస లేదా హృదయ స్పందన ఆగిపోయినప్పుడు, గుండె కొట్టుకొకపోవడం, అపస్మారక స్థితిలో వున్నప్పుడు గుండె, మెదడుకు రక్త ప్రసారణ పునరుద్ధరించడానికి, చేసే చికిత్స అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజీ విభాగపు వైద్యులు, స్విమ్స్ ఛీఫ్.ఎం.ఆర్.ఓ.వివేకనందా, ఎం.ఆర్.ఓ శిరీషా, తిరుపతి సన్ ఫార్మా కంపెనీ మెడికల్ రెప్స్ రామాంజనేయులు, శరణ్ కుమార్, పేషంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌరహక్కులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - రామచంద్రాపురం : ప్రతి ఒక్కరూ పౌర హక్కులను సద్వినియోగించుకోవాలని తహశీల్దార్ మధుసూదన్ రావు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పెద్ది నాయుడు కండ్రిగ ఏ ఏ డబ్ల్యూ లో మండల స్థాయి అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూ, ప్రజా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అర్హులైన వారు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి మార్కండేయ నాయుడు మాట్లాడుతూ గ్రామాలలో బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన ఉచిత విద్య బోధన అందిస్తామన్నారు. ఏఎస్ఐ ఈశ్వరయ్య మాట్లాడుతూ గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. సొరకాయల పాల్యం బీసీ హాస్టల్ వార్డెన్ నాయక్ మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నరసింహులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

గుండె పదిలంగా ఉంటే ఆరోగ్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రపంచ హృదయ దినోత్సవం 2025 సందర్భంగా ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, వినాయక సాగర్ వాకర్స్ క్లబ్, లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత గుండె పరీక్ష శిబిరాన్ని సోమవారం తిరుపతి, వినాయక సాగర్ పార్క్‌లో నిర్వహించారు. ఈ శిబిరంలో 280 మంది లబ్ధిదారులు పాల్గొని వివిధ రకాల హృదయ సంబంధిత పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజర య్యారు. ఆయన మాట్లాడుతూ హృదయ సంబంధిత వ్యాధులపై ప్రజలలో అవగాహన పెంపొందించడం అవసరమన్నారు. చైర్మన్, ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ సమాజ ఆరోగ్యాన్ని కాపాడటంలో వైద్య సంస్థల పాత్ర కీలకమన్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు కలిసి పనిచేస్తే హృదయ వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ డాక్టర్ శ్రీధర్ ముని, ఎండి డాక్టర్ సునంద కుమార్ రెడ్డి, డాక్టర్ ప్రథిమ తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థపై నమ్మకం కోల్పోయేలా చితకబాదారు

పాత కక్షలతోనే సిఐ దాడి చేశారు: భరత్ కుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రక్షణ కోసం పోలీస్ స్టేషన్ గడప ఎక్కాలంటేనే భయమేస్తోందని, పోలీసు వ్యవస్థపై నమ్మకం కోల్పోయేలా శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ గోపి ఒక రాజకీయ పార్టీకి ప్రతినిధినని తెలిసి కూడా ఫైబర్ లాటితో ఇష్టానుసారం చితక బాధడని భారతీయ జనతా పార్టీ శ్రీకాళహస్తి యువత అధ్యక్షులు భరత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నవయుగ హోటల్లో అక్కడి సిబ్బందికి తనకు జరిగిన వాగ్వాదానికి సంబంధంలేని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన జయకృష్ణారెడ్డి అతని అనుచరులు ఉద్దేశపూర్వకంగా కలుగ చేసుకుని తనను రెండు పర్యాయాలు వీధుల్లో కొడుతుండగా పోలీసు సిబ్బంది రక్షించి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళితే అక్కడ కూడా వాగ్వాదాలు జరిగాయని, అప్పుడే వచ్చిన సిఐ గోపి బూతులు మాట్లాడుతూ లాఠీతో ఇష్టానుసారం తన కుటుంబ సభ్యులను తరుముతూ మృగంలా ప్రవర్తించాడని ఆరోపించారు. శ్రీకాళహస్తి పట్టణం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఉన్న సిఐ గోపి వ్యవహార శైలి దారుణంగా ఉందని, గతంలో ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కక్ష పెంచుకొని ఇదే అదునుగా శరీరమంతటా గాయాలు అయ్యేలా కొట్టారన్నారు. భరత్ కుమార్ భార్య ఝాన్సీ మాట్లాడుతూ సీఐ ప్రవర్తన శైలి చూసి అనుమానం వచ్చి ఆయన మద్యం సేవించాడని మాట్లాడటంతో వెంటనే అప్రమత్తమైన సిఐ గోపి లోపలికి వెళ్లి నాలుగు గంటలసేపు బయటకు రాలేదని ఆరోపించారు. మహిళల పట్ల, ఫిర్యాదు దారుల పట్ల పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలని చట్టాలు చెబుతుంటే శ్రీకాళహస్తి పట్టణం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మాత్రం ఇందుకు భిన్నంగా ఉందని, అసభ్యకరమైన పదజాలాన్ని అక్కడి పోలీసులు వాడడం దేనికి సంకేతం అన్నారు. పైగా మాపై దాడి చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వారిని మర్యాదపూర్వకంగా మాట్లాడి స్టేషన్ నుండి పంపించి వేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పోలీసు వ్యవస్థ పైన నమ్మకం సన్నగిల్లేలా ప్రవర్తిస్తున్న సిఐ గోపిపై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:మండల పరిధిలోని కాటరు, వియస్ పురం గ్రామాలలో సోమవారం అగ్రికల్చర్ అధికారి షణ్ముగం ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రం సీడ్ పద్ధతిలో వరి నాట్లు వేయడం, కలుపు నివారణ సూచనలు చేశారు. అన్నదాత సుఖీభవ వర్తించని రైతులు 20వ ఈకేవైసీ చేసుకొని వివరాలు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ రేవతి పాల్గొన్నారు.

మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరుపై హర్షం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: అక్రమ మద్యం కేసులో అరెస్టయిన మిథున్ రెడ్డికి బెయిల్ రావడంపై వైసీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మళ్లీ ప్రజాల్లోకి వచ్చి ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తారని వారు తెలిపారు. ఆయనకు బెయిల్ రావడంపై న్యాయం గెలిచిందని సంబరాలు చేసుకున్నారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నారాయణవరం మండలం, తడుకు బీసీ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను నారాయణవరం మండలం, ఎంపీపీ దివాకర్ రెడ్డి చేతులు మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, సర్పంచ్ రామ్మూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని గూడూరు తహశీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు మండల పరిధిలోని పారిచర్ల రాజుపాలెం, ఎస్టీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులకు ఉన్న హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు ఏసుపాక పెంచలయ్య, వెంకటేశ్వర్లు, ఇంచార్జి ఎంపిడిఓ మోహన్, ఏపీఎం బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు:వాకాడు ఎంపీడీవో సాయిప్రసాద్ సోమవారం వాకాడు సచివాలయం2 ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొంతమంది సచివాలయం సిబ్బంది అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం చేయనందున, మూమెంట్ రిజిస్టర్‌లో ఎక్కడికి వెళ్ళింది నమోదు చేయనందన వారికి షో కాజ్ నోటీసు ఇవ్వవలసినదిగా సెక్రటరీకి ఆదేశాల జారీ చేశారు.